

# మేమోరి అర్చన

యలమంచిలి శేషగిరిరావు

సమయం సాయంత్రం నాలుగున్నర కావస్తుంది.

ఆ రోజు ఆఫీసునుండి ఓ గంట ముందుగా పర్మిషన్ తీసుకుని వెళ్దామని ఉదయమే అనుకున్నాను. రవీంద్ర భారతికి వెళ్ళాలి. అక్కడ కల్చరల్ ఎఫైర్స్ ఆఫీసులో మావాడు రమేష్ ఎకౌంట్స్ సెక్షన్‌లో క్లర్క్‌గా చేస్తున్నాడు. అంతకు ముందు వాడు సెక్రటేరియట్‌లో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో వుండేవాడు. సాంస్కృతిక కార్యక్రమాల మీద వున్న ఆసక్తికొద్దీ వాడు అవకాశం చూసుకుని డెప్టేషన్ మీద డైరక్టరేట్ ఆఫ్ కల్చరల్ అఫైర్స్‌కి వచ్చాడు. వాడు దాంట్లోకి వచ్చినప్పటినుండి, నేను రవీంద్ర భారతికి అప్పుడప్పుడూ వెళ్ళడం పరిపాటి అయింది ఏదైనా మంచి ప్రోగ్రాం వుంటే వాడు ముందుగా నాతో చెప్తాడు నేను వెళ్తుంటాను

అలాగే ఈ రోజు కూడా ఏదో ప్రత్యేక నృత్య కార్యక్రమం ఉందని నిన్ననే వాడు చెప్పడం మూలాన ముందుగా వెళ్ళే ప్రయత్నంలో వున్నాను.

నేను చేయవలసిన పని ఇంకా పూర్తి కాలేదు. మాదొక పత్రికాఫీసు. దాంట్లో నేనొక ఆర్టిస్టుని. పర్మిషన్ అడగటానికి ఎడిటర్ వద్దకు వెళ్లాను.

పోటీకి సంబంధించి వచ్చిన కథల్లో మునిగిపోయిన ఆయన నా అలికిడికి నా వంక చూసి కూర్చోమని, విషయం ఏమిటని కళ్ళగరేసాడు

"సార్ ఇవాళ ఓ గంట పర్మిషన్ కావాలి కొంచం పనుంది"

"ఇవాళ ప్రింటింగ్‌కి వెళ్ళవలసిన పేజీలన్నీ అయిపోయినట్టేనా?" అడిగా డాయన.

"ఇవాళ పదహారు పేజీలు అవ్వాలని చెప్పాను కదా! పన్నెండు పేజీలు ఆర్ట్ ప్రూఫ్స్ వచ్చాయి అవన్నీ లే-అవుట్ చేసేసాను. ఇంకా నాలుగు పేజీల మాటర్ కంపోజింగ్ నుండి రావాలి ఆ నాలుగు పేజీలుకూడా లే-అవుట్ చేసి లెటరింగ్ రాసేసాను మాటర్ పేస్టింగ్ మాత్రమే బాకీ. మాటర్ రాగానే పేస్టింగ్ చేయమని శేఖర్‌కి చెప్పాను." అంటూ వివరించాను.

"గుడ్ ఆ నాలుగు పేజీలూ అయిపోగానే మొత్తం పేజీలు నాకు చూపించమన్నానని శేఖర్‌కి చెప్పాను. సరే పర్మిషన్ కావాలన్నావు కదా! వెళ్లు" అని ఆయన పనిలో మునిగిపోయాడు.

జూనియర్ ఆర్టిస్ట్ శేఖర్‌కి ఇవ్వాల్సిన సూచనలిచ్చి నేను రవీంద్ర భారతికి బయలుదేరాను.

నేను వెళ్ళేసరికి అయిదు గంటలయింది.

రమేష్ హడావిడిలో వున్నాడు నాకు ఎంట్రెన్స్ పాస్ ఇచ్చి "ఒరేయ్ నా పని తెలుసు కదా! నువ్వెళ్ళి కూర్చుని ప్రోగ్రాం చూడు. ప్రోగ్రాం అయ్యాక మనం కలుద్దాం" అన్నాడు.

◆ ◆ ◆

కార్యక్రమం మొదలయింది. ముఖ్య అతిథి ప్రసంగం, నలుగురు ప్రముఖుల ప్రసంగాలు అయ్యాక ఎనౌన్స్‌మెంట్ వినబడింది.

"మరికొద్ది క్షణాల్లో కుమారి అర్చన నృత్యకార్యక్రమం మొదలవుతుంది."

అర్చన!

నా మెదడు పొరల్లో ఏదో కదలిక!!

ఆ పేరుతో నాకున్న సాన్నిహిత్యం జ్ఞాపకం వచ్చింది.

కానీ...

నాకు తెలిసిన అర్చన పేరుముందు 'శ్రీమతి' అని వుండేది. మరి ఈ 'కుమారి' అర్చన ఎవరో!?

ఆలోచన పక్కకి నెట్టి దృష్టిని స్టేజీ మీదకి కేంద్రీకరించాను

హాలు నిశ్శబ్దంతో చేతులు కలిపింది.

చీకటిగా వున్న స్టేజీమీద; పైనుండి సన్నటి కాంతి ఫోకస్ చేయబడి వుంది ఆ వెలుగులో సమస్కరిస్తున్న రెండు చేతులు!

నాజూకుగా, సున్నితమైన రెండు చేతులు!!

చేతులు తప్ప మిగతా శరీరం లీలా మాత్రంగా కనబడుతోంది.

నల్లటి పేపరుమీద గ్రే కలర్‌తో వాష్‌వర్క్ చేసిన పేయింటింగ్‌లా హృద్యంగా వుందా దృశ్యం.

ప్రార్థనా గీతం పూర్తయింది.

రెండువైపుల నుండీ లైట్స్ ఫోకస్ చేయబడ్డాయి

నృత్యం మొదలయింది.

ఎక్కడో కొండల్లో కోనల్లో పుట్టిన సెలఏరు, ఆ కొండలనడుమ వయ్యారంగా మెలికలు తిరుగుతూ పోనుపోను వేగాన్ని పెంచుకుంటూ ఆనక గంభీరంగా సాగిపోయే నదిలా సాగిందామె నృత్యహేల

స్టేజీ ముందుకు వచ్చినప్పుడల్లా మేకప్‌లో నిండిన ఆ ముఖం అస్పష్టంగా కనబడుతోంది

ఆ ముఖకవళికలు చూస్తుంటే మనసులో ఓ రూపు కదులుతోంది

నృత్యం ముగిసింది

సముద్రపు హోరులా ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో హాలు దద్దరిల్లి పోయింది.

ప్రేక్షకులకి నమస్కరించి, వారి అభినందనల్ని స్వీకరిస్తూ లోనేలికి వెళ్ళిపోయింది అర్చన

ఆమెని, ఆ అర్చనని కలుసుకోవాలనిపించింది

రమేష్ వుండే సెక్షన్‌కి వెళ్లాను రమేష్ చాలా హడావిడిలో వున్నాడు ఏదో డబ్బు లెక్కచూస్తున్న రమేష్‌ని భుజంతట్టి పిలుస్తూ "ఒరేయ్ రమేష్, చిన్న హెల్ప్ చేయాల్రా?"

"ఏం కావాల్రా?"

"ఆ డాన్సర్ అర్చన దగ్గరికి తీసుకెళ్ళి పరిచయం చేస్తావా?"

"నే నిప్పుడు ఆ అమ్మాయి దగ్గరకే వెళ్తున్నాను. ప్రోగ్రాం [illegible] డబ్బు ఇవ్వాలి నాతోపాటు రా ఆమె చుట్టూ ఎవరూ లేకపోతే పరిచయం చేస్తాను" అన్నాడు వాడు లేస్తూ

"సరే పద."

ఇద్దర్దం గ్రీన్‌రూంలోకి వెళ్లాము

అప్పుడే ఆమె మేకప్ తీసేస్తోంది.

ఆమె మా వేపు తిరిగింది

ఆమె . ?

అవును . ఆమె శ్రీమతి అర్చన.

మరి ఇందాక..

ఆమె ఇంకా నన్ను గమనించలేదు

"హలో మీరా రండి" అంది రమేష్‌వంక చూస్తూ

గమ్మత్తయిన ఆమె తెలుగు ఉచ్చారణ గతంలోని జ్ఞాపకాలని వెలికి తీస్తోంది

"మరేం లేదు ప్రోగ్రాం తాలుకూ డబ్బు మీ కిద్దామని వచ్చాను. ఆ అన్నట్టు వీడు నా బెస్ట్ ఫ్రెండ్, ఆర్టిస్ట్ కృష్ణకుమార్. మిమ్మల్ని పరిచయం చేసుకోవాలని వచ్చాడు"

"నమస్కారం" చేతులు జోడిస్తున్న ఆమె విపరీతమయిన ఆశ్చర్యంతో ముఖాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది.

నేను మామూలుగానే "నమస్కారం" అన్నాను

"వీడు ఓ వారపత్రికలో ఆర్టిస్ట్‌గా చేస్తున్నాడు ఇదిగో ఈ డబ్బు తీసుకుని

కాస్త ఈ ఓచర్ మీద సంతకం పెట్టండి" అంటూ రమేష్ డబ్బు, ఓచర్ అందించాడు

మౌనంగా అందుకుని సంతకంపెట్టి ఓచర్ ఇచ్చింది

"ఒరేయ్ కృష్ణా మీరు మాట్లాడు తుండండి నాక్కాస్త పనుంది మనం మళ్ళీ రేపు కలుద్దాం" అంటూ వాడు హడావిడిగా వెళ్ళిపోయాడు.

"చెప్పండి కృష్ణకుమార్‌గారూ విశేషాలు! మనం కలుసుకుని చాలా రోజు లైంది కదూ!?"

"ముందు మీరు డ్రస్ ఛేంజ్ చేసుకోండి, తర్వాత మనం తీరిగ్గా మాట్లాడుకోవచ్చు బయట వెయిట్ చేస్తాను" అంటూ బయటికి వచ్చాను.

• • •

గ్రీన్ రూం తలుపులు తెరుచుకున్నాయి

డార్క్ బ్రౌన్ కలర్ చీరలో బయటికి వచ్చింది అర్చన.

ఆ నిండైన విగ్రహాన్ని క్షణకాలం కన్నార్పకుండా చూశాను.

"వెళ్దామా" దగ్గరకొస్తూ అడిగిందామె.

పక్క పక్కన నడుస్తున్నాం. ఆమెతో కలిసి నడుస్తుంటే ఏదో మధురమైన అనుభూతి కలుగుతోంది

"ఎక్కడుంటున్నారు?" అడిగాను స్కూటర్ దగ్గరికి నడుస్తూ

"అశోకా హోటల్‌లో. మీ రుండేది ఎక్కడ? ఇంట్లో ఎవరెవరు వుంటున్నారు?" ప్రశ్నించిందామె

"అమీర్‌పేట ఒక్కడినే......... ఒంటరిగా. . ."

నడుస్తున్నదల్లా ఆగిపోయి నా ముఖంవంక పరిశీలనగా చూస్తూ "మీ వయసు ముప్పై అనుకుంటాను మరి జీవితాన్ని ఒంటరిగానే గడపదల్చుకున్నారా?"

"కొన్ని కొన్ని భావాలు మనసులో గాఢంగా ముద్రవేస్తాయి. వాటినుండి బయటపడి రావడం కష్టం ప్రస్తుతం ఒంటరిగానే గడపదలిచాను భవిష్యత్తులో.. ఏమో .. " అంటూ అర్థవంతంగా నవ్వాను.

"హోటల్‌కి వెళ్దామా?" అడిగాను స్కూటర్ తీస్తూ.

"పదండి."

హోటల్‌కి చేరుకున్నాము భోజనం చేసి తీరిగ్గా రూంలోకి చేరుకునే సరికి సమయం పదిగంటలయింది

ఇద్దరం కుర్చీల్లో ఎదురెదురుగా కూర్చున్నాము

కాసేపు మౌనంగా గడిచింది కాలం

ఇద్దరికీ ఎన్నో మాట్లాడాలని వుంది కానీ గొంతుదాటి రావడంలేదు

నా కర్థంకాని దొక్కటే, నాకు తెలిసిందీ, నేను చూసిందీ శ్రీమతి అర్చననే, కానీ...?!

విషయం ఏమిటో బోధపడలేదు. అదే విషయాన్ని ముక్కుసూటిగా అడిగితే, అసలే సున్నితమనస్కురాలు ఈమె బాధపడొచ్చు.

"మీవారేం చేస్తున్నారు?" అమాయకంగా ప్రశ్నించాను

ఆ ప్రశ్నకోసమే ఎదురుచూస్తున్నట్లు మెల్లగా కనురెప్పలెత్తి నా కళ్ళలోకి చూసింది. విశాలమైన ఆ కళ్ళల్లో సన్నటి నీటిపొర

స్వేచ్ఛగా, స్వచ్ఛంగా ఎగురుతున్న పావురాయి బాణందెబ్బ తిన్నట్టుగా వుంది ఆమె ముఖం. భారంగా నిట్టూర్చి కుర్చీలో చేరగిలపడి–

"అయిదేళ్ళ క్రితమే కుమారి అర్చనగా మారాను" అర్థంచేసుకోమన్నట్టుగా క్లుప్తంగా వున్నాయామె మాటలు.

నా ఆలోచనలు ఒక్కసారిగా గతంలోకి పరుగులుతీసాయి

♦ ♦ ♦

డిగ్రీలో విద్యార్థిదశ పూర్తిచేసుకున్న రోజులు అవి

డిగ్రీలో నా స్నేహితుడు శ్రీకాంత్ నేనూ ఒక ప్లాన్ వేసుకున్నాము. మేమిద్దరం కలిసి ఢిల్లీకి వెళ్లాలని రెండు జతల బట్టలు, వెళ్ళడానికి చార్జీలు మాత్రమే వెంట తీసుకెళ్ళాలని అనుకున్నాము. మేం చదివిన చదువునీ పెద్దవాళ్ళ పలుకుబడినీ ఉపయోగించుకోకుండా ఒంటరిగా కొంతకాలం ఎవరూ తెలియని ఊళ్ళో స్వతంత్రంగా బ్రతకాలని సరదాపుట్టింది మాకు.

ఢిల్లీ వెళ్ళగానే వారం పదిరోజులు చాలా కష్టాలుపడ్డాము. ఏ రకమైన పనీ దొరకలేదు వాతావరణం పడక శ్రీకాంత్‌కి జ్వరం వచ్చింది వాడిని రైల్వేస్టేషన్‌లో ఓ మూల పడుకోబెట్టి, బజారులోకి వచ్చాను ముందు తిండి సంగతి దేవుడెరుగు, వాడికి వైద్యం చేయించాలి. ముందూవెనకా ఆలోచించకుండా ఇలా వచ్చినందుకు నామీద నాకే కోపం వచ్చింది ఏం చేయాలా అని ఆలోచిస్తూ షాపులవంక చూస్తూ నడుస్తున్నాను.

ఓ షాపులో షోకేసులో పెయింటింగ్స్ కనబడ్డాయి. మదిలో ఓ ఆలోచన మెదిలింది వాటిని చూడగానే.

చూస్తూ నిలబడ్డాను. లోపల యజమాని కాబోలు నా వయసే వుంటుంది. "క్యాహోనా?" అంటూ ప్రశ్నించాడు.


వచ్చిన ఈ పదిరోజులలో కాస్తో కూస్తో హిందీభాష వచ్చింది

"ఈ పెయింటింగ్స్ మీరే వేసి అమ్ముతున్నారా?"

నే నెందుకు అలా అడిగానో అర్థం కాలేదనికి.

"లేదు ఆర్టిస్టుతో వేయించి అమ్ముతాం."

"ఒక్కోదానికి ఎంతిస్తారు ఆర్టిస్టుకి?"




"అసలు ఈ సమాచారం అంతా దేనికి నీకు?" కొనే బేరం కాదని తెలిసి చిరాకుగా అడిగాడు.

"మరేంలేదు. నేను కూడా వేస్తుంటాను. మీరు కనుక అవకాశం ఇస్తే నేను వేసిస్తాను. డబ్బుకూడా ఎక్కువ అక్కర్లేదు. తిండికి సరిపోను ఇస్తే చాలు" జాలిగా అడిగాడు అతన్ని

ఏమనుకున్నాడో ఏమో మరి నిలువెల్లా ఓసారి చూసి లోపలికి రమ్మన్నాడు

పెయింటింగ్ వేయడానికి కావల్సిన సామాగ్రి అంతా ఇచ్చి 'పూరికే ముందు ఒకటి వేసి చూపించు. నచ్చితే వేస్తుందువుగానీ, అప్పుడు డబ్బు ఇస్తాను" అన్నాడు అతను

సాయంత్రం వరకు కదలకుండా కూర్చొని చక్కగా వేసిచ్చాను. ఫరవాలేదు బాగానే వచ్చిందనిపించింది. అది చూసి అతనుకూడా సంతృప్తి చెందాడు.

"ఎక్కడుంటున్నావు?"

పరిస్థితి అంతా వివరించాను

"మా యింటిపక్కనే ఓ చిన్న గది వుంది. దాంట్లో వుండు ఇంటిదగ్గరే పనిచేద్దువుగానీ. రోజుకి కనీసం రెండు సీనరీలన్నా వేయాలి. మోడల్స్ ఇస్తుంటాను ఇదిగో ఈ డబ్బు తీసుకుని నీ స్నేహితుడికి ముందు వైద్యం చేయించు. రేపు ఉదయం వస్తే ఇల్లు చూపిస్తాను."

మనసులోనే అతనికి నమస్కరించాను, అవసరంలో సహాయం చేస్తున్నందుకు

శ్రీకాంత్‌కి మందులు కొన్ని తీసుకెళ్ళాను. ఆ రాత్రి కూడా రైల్వే ప్లాటుఫాం మీదే జాగారణ చేశాము.

తెల్లవారింది. ఇంకా జ్వర తీవ్రత తగ్గలేదు శ్రీకాంత్‌కి.

"ఒరేయ్ శ్రీకాంత్! నువ్వు ఇంటికి వెళ్ళిపోరా!"

ముందు వాడు ఒప్పుకోలేదు నా బల వంతం మీద వప్పించాను.

పదిగంటలకి ఇద్దరం నిన్న వెళ్ళిన షాపుదగ్గరికి వెళ్ళాము. శ్రీకాంత్ గురించి అతనికి చెప్పాను. టికెట్‌కి చార్జీలు ఇచ్చాడు.

శ్రీకాంత్‌ని రైలు ఎక్కించి పంపాను.

ఆ సాయింత్రం షాపు యజమాని తన యింటికి తీసుకెళ్ళాడు అది ఇల్లు అనడంకన్నా ఓ గది అనడం బాగుం టుంది. దానికి ఆనుకునే ఓ చిన్న రేకుల షెడ్డుంది. షాపులో పనికిరాని సామా నంతా అందులో వేసి వున్నాయి

నాకు ఓ చాప, ఓ దుప్పటి ఇచ్చాడు

"రేపు నాతోపాటు షాపుకి వచ్చి బొమ్మలేయడానికి కావాల్సిన సామాను తెచ్చుకుందువు,ఈ అయిదు రూపాయలూ తీసుకెళ్ళి ఏమైనా తినిరా! ఇవాల్టికి రెస్ట్ తీసుకో" ఎర్రబడ్డ నా కళ్ళనీ, పీక్కు పోయిన నా ముఖాన్ని చూసి చెప్పాడు

♦ ♦ ♦

మెలకువ వచ్చింది సన్నగా వెలు తురు పడ్తోంది, పైన రేకుకున్న ఓ కంతలో నుండి లేచి బయటికి వచ్చాడు

అప్పుడే మంచుతెరలు తొలగించి సూర్యుడు తన కార్యక్రమాన్ని మొద లెడుతున్నాడు. కొద్దిగా చలిగా వున్నా ఆహ్లాదకరంగా వుంది వాతావరణం.

కాలిగజ్జెల అలికిడి విని పక్కగుమ్మం వంక చూశాను

ఏదో తెలియని మాయతెర నా కళ్ళకి కమ్మినట్టయింది కళ్ళప్పగించి అటే చూస్తూ నిలబడ్డాను

వాకిలి వూడుస్తూ కనబడింది ఇరవై ఏళ్ళ పడుచు. సృష్టికర్త చాలా శ్రద్ధతో మలిచినట్లుంది ఆమె విగ్రహం అప్పుడే ఆమె కూడా నావంక చూసింది. స్వచ్ఛంగా ఇంతింత కళ్ళతో కను రెప్పలు టపటపలాడిస్తూ చూస్తోంది

"అర్చన ఇటు రా" అని లోపలి నుండి అతని కంఠం వినబడుడింది.

"వస్తున్నా" అంటూ ఆమె బొడ్లో దోపుకున్న చీర కుచ్చెళ్ళు సవరించు కుంటూ లోపలికెళ్ళింది.

'అర్చన' ఎంత బావుంది పేరు!

ఆమె ప్రతీ కదలిక ఓ నృత్య భంగి మలా తోచింది నాకు.

షాపుకెళ్ళేవరకూ ఆమె రూపం నన్ను వెంటాడుతూనే ఉంది.

♦ ♦ ♦

మధ్యాహ్నం షాపునుండి నాక్కావా ల్సిన సామాను తీసుకుని దారిలోనే కడుపునింపుకుని గదికి వచ్చాను

నా గదిలోకి వెడుతూ పక్కగుమ్మం వంక చూసాను. తలుపులు దగ్గరగా వేసివున్నాయి



లోపలినుండి ఘల్లుఘల్లుమని కాలి అందెలసవ్వడి వినిపిస్తోంది లయబద్ధంగా ఆ పూట పనిమీదకి ధ్యాస పోలేదు మువ్వలశబ్దం వస్తున్నంత సేపూ ఆలకిస్తూ వుండిపోయాను.

సాయంత్రం కావొస్తోంది. దాహంగా వుంది. వాళ్ళ గదిదగ్గరకి వెళ్ళి మూసి వున్న తలుపుల్ని తట్టాను మెల్లగా

ఆమె వచ్చి తలుపులు తెంచింది నిర్మలంగా వున్న ఆమె ముఖాన్ని చూస్తుండిపోయాను.

"క్యాహోనా?" ఆమె ప్రశ్నతో ఉలిక్కిపడి "మంచినీళ్ళు కావాలి" అప్రయత్నంగా అన్నాను తెలుగులోనే.

"వుండండి తెస్తాను" అంది ఆమె కూడా తెలుగులోనే ఆశ్చర్యమనిపించింది ఆమె తెలుగులో మాట్లాడటం కానీ ఆమె ఉచ్చారణ చాలా గమ్మత్తుగా వుంది

"తీసుకోండి" గ్లాసు అందించింది అర్చన.

నీళ్ళు తాగి ఖాళీగ్లాసు తిరిగిస్తూ "మీకు తెలుగు తెలుసా?" అడిగాను

"అంత బాగా రాదు. కొంచం మాట్లాడగలను. ఇటుపక్క ఇంట్లో ఇది వరకు ఓ తెలుగు దంపతులుండేవారు. ఆమె నాకు మంచి స్నేహితురాలు ఆమె నేర్పింది. మీరు తెలుగువారే కదా! ఆయన చెప్పారు మీ గురించి ఏమన్నా కావలిస్తే అడగండి.

"చాలా థాంక్స్! అలాగేనండి" అంటూ వచ్చేసాను

• • •

రెండు నెలలు గడిచాయి. అతను చాలా ముభావంగా చిరాకుగా వుంటాడు ఎప్పుడూ. నాకు ఆశ్రయమివ్వడంలో అతనికి లాభంవుంది కనుకనే ఇచ్చాడు. చవకగా నేను వేసిన పెయింటింగ్స్ దొరుకుతున్నాయి. అవి బాగానే అమ్ముడవుతున్నాయి. లాభం వస్తోంది కనుకనే నన్ను ఆదరించాడు. నా ఖర్చులు, తిండివరకు డబ్బులిచ్చేవాడు.

ఇహ ఆమె విషయం...

మొదట్లో నాతో చాలా తక్కువగా మాట్లాడేది, రాన్రాను మా మధ్య సాన్నిహిత్యం స్నేహం పెరగసాగింది దానికి కారణం మా అభిరుచులు ఒక్కటే కావడం ఆమెకి నృత్యంలో ప్రవేశం వుంది. నాకూ అందులో అంతో ఇంతో అభిరుచి వుంది కాబట్టి మా మధ్య అ సంభాషణ దొర్లేది నాతో మాట్లాడే విషయంలో ఆమె చాలా జాగ్రత్తగా వుండేది అతనున్నంత సేపూ బయటికి వచ్చేది కాదు. కానీ, ఆమెమీద అతని అరుపులు, చిరాకులు బయటికి వస్తుండేవి. అప్పుడప్పుడూ సన్నగా ఆమె ఏడుపు వినబడేది. మా మధ్య స్నేహం పెరిగినా ఏనాడూ తన భర్త గురించి, తన్న అంతరంగిక విషయాలు గురించి నాతో చెప్పేది కాదు

ఓ రోజు.

మధ్యాహ్నం రెండుగంటలు కావస్తోంది నేనుండే గది గుమ్మంలో ఆమె నుంచుని వుంది. నేను లోపల కూర్చుని ఆమె నిలబడిన భంగిమ వేస్తున్నాను అర్చన నిలబడిన తీరు చాలా అద్భుతంగా వుందని ఆ భంగిమని రంగుల్లోకి మలుస్తానని ఆమెని కోరాను. చాలా బలవంతంమీద, అది తన భర్త కంటపడకూడదన్న షరతుమీద ఒప్పుకుంది

నా పనిలో నేనుండి అతను వస్తున్న సంగతి గమనించలేదు. బొమ్మ వేస్తున్న నన్నూ, నించున్న ఆమెనీ చూసి కోపంగా అర్చన చెంపమీద కొట్టాడు అతను.

నోట మాటరాలేదు నాకు

ఆమె కళ్ళనిండా నీరు నింపుకుని వాళ్ళ గదిలోకి వెళ్ళిపోయింది నా వంక తీవ్రంగా చూస్తూ అతను కూడా వాళ్ళ గదిలోకి వెళ్ళాడు ఆమె వెనకాలే.

కాసేపటివరకు ఆ గదిలోనుండి అతని అరుపులు, కేకలూ, మధ్యలో ఆమె వంటిమీద పడుతున్న దెబ్బల శబ్దాలు. సన్నగా రోదిస్తున్న ఆమె కంఠం వినబడసాగింది.

భరించలేకపోయాను

తలుపులు తెరుచుకుని లోపలికి వెళ్ళాను. నన్ను చూడగానే అతడు ఆగిపోయాడు అర్చన ఓ మూలకి వెళ్ళి మౌనంగా రోదించసాగింది.

పావురాయి ఈకలు తగిలించుకున్న రాబందులా కనిపించాడు . అతను నా కంటికి

"చూడండి నా మూలంగా ఆమెను మీరు బాధించడం బాలేదు. ఇద్దరికీ ఒకే రకమైన అభిరుచులుండబట్టి స్నేహంగా మాట్లాడుకుంటున్నాము, ' అందాన్ని చూసి ఏ చిత్రకారుడూ వూరుకోలేడు నా బలవంతంమీదే ఆమెని వప్పించి ఆమె బొమ్మని చిత్రీకరిస్తున్నాను. అనవసరంగా ఆమెని బాధించకండి. నేనే ఇక్కడ్నుంచి వెళ్ళిపోతాను. వస్తాను" అనిచెప్పి ఓసారి ఆమెని మనసారా చూసి వచ్చేసాను.

అంతే! ఇహ ఢిల్లీలో వుండబుద్ది కాలేదు ఉన్నదగ్గర్నుంచి అర్చన జ్ఞాపకం వస్తోంది అంతగా ఆమె స్నేహం రూపం నాలో ముద్రపడ్డాయి.

తర్వాత హైదరాబాద్ వచ్చేసి ఓ వారపత్రికలో స్టాఫ్ ఆర్టిస్టుగా స్థిరపడిపోయాను అర్చనకూడా నాతో గాఢంగా స్థిరపడిపోయింది.

• • •

గతం, స్మృతిపథంలో మెదిలి కళ్ళు చెమర్చాయి నాకు అర్చన వంక చూసాను

నా చూపులోని ప్రశ్నని అర్థంచేసుకున్నట్లుగా "మీరు వెళ్ళిపోయాక రోజూ ఆయన నన్ను హింసిస్తూ వుండేవాడు. భరించలేకపోయేదానిని. మా అన్నయ్య సహాయంతో విడాకులు తీసుకుని ఒంటరిగా వుంటూ నృత్యసాధన చేసాను. మెల్లగా ప్రోగ్రాములు ఇవ్వడం ప్రారంభించాను కుమారి అర్చనగా మిగిలాను. నేను చేసింది తప్పంటారా?" అమాయకంగా ప్రశ్నించిన ఆమెకి నేనేం సమాధానం చెప్పగలను?

పెళ్ళికాక మునుపు కుమారి అర్చన,
పెళ్ళయ్యాక శ్రీమతి అర్చన,
మరి ఆ పెళ్ళే రద్దయిపోతే . ?

నిజమే ఆమె కుమారి అర్చనే! తప్పని నేనేం అనగలను.

"అది సరేగానీ, మీ గురించి చెప్పరేం? చక్కటి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోకుండా ఎన్నాళ్ళు ఒంటరిగా వుండిపోతారు? పెళ్ళి చేసుకుని నిండైన జీవితాన్ని సాగించండి."

అభిమానంగా ఆమె చెప్పుతున్న మాటలు వింటుంటే నాలో ఏదో కదలిక!

ఎందుకో గుండె స్పందించటం మొదలుపెట్టింది!

మౌనంగా ఆమెవంక చూస్తుండి పోయాను.

"ఏమిటి మాట్లాడకుండా వుండి పోయారు? వ్యక్తిగత విషయాలు ప్రశ్నిస్తున్నాననా? పోనీ అభ్యంతరం మైతే చెప్పకండి."

"అబ్బెబ్బె అదేంలేదు! చెప్పానుగా ఇందాకే, సాధ్యంకాదని తెలిసినా అనుకోకుండా కొందరిమీద మనకు కొన్ని అభిప్రాయాలు ఏర్పడుతాయి. వాటినుండి బయటపడినప్పుడు జీవితభాగస్వామివి ఆహ్వానించాలని అనుకున్నాను నిన్నటి వరకు. కానీ...ఒకప్పుడు సాధ్యం కాదనుకున్న నా అభిప్రాయం ఇప్పుడు...ఇప్పుడు...సాధ్యం కావచ్చేమో అన్న ఆశ కలిగింది నాలో" ఆమె కళ్ళల్లో దేనికోసమో వెతుకుతూ చెప్పాను!

నా చూపుల్నుండి తప్పించుకుంటూ "సరిగ్గా చెప్పండి"

ఇహ సూటిగా విషయాన్ని చెప్ప దలుచుకున్నాను!

"నీకు...మీకు...అభ్యంతరం లేక పోతే శ్రీమతి అర్చనాకృష్ణకుమార్‌గా మారడానికి అంగీకరిస్తారా?" అనిచెప్పి ఆమె ముఖంవంక చూడలేక లేచి కిటికీవద్దకు వెళ్ళి బయటికి చూడసాగాను ఆమెనుండి ఏం సమాధానం వస్తుందో అనుకుంటూ.

బయటంతా చీకటిగా వుంది.

కాసేపు కాలం మౌనంగా గడిచింది.

ఆమెనుండి సమాధానం కోసం చూస్తున్న నేనే, మౌనంగా వుండేసరికి వెనక్కి తిరిగి చూసాను.

అర్చన కూడా కుర్చీలోనుండి లేచి నావైపు రాసాగింది.

దగ్గరగా వచ్చి తలవంచుకుని "క్షమించండి! ఇహ నేను నేనుగానే వుండిపోదలుచుకున్నాను. ఓసారి శ్రీమతిగా జీవితాంతం సరిపోను 'అనుభవాన్ని' పొందాను. మరోసారి శ్రీమతిగా మారే ఆలోచన లేదు. మీ అభిప్రాయానికీ, అభిమానానికి చాలా కృతజ్ఞతలు నేను కుమారిగానే మిగిలి పోయి, నా జీవితాన్ని నృత్యానికే అంకితం చేయదలుచుకున్నాను! మీ మనసుని బాధపెడితే క్షమించండి" చెప్పింది మెల్లగా.

"మనం స్నేహితులుగానే మిగిలి పోదాం. పరిపూర్ణమైన స్నేహాన్ని పంచుకుందాం" అంటూ నా చేతిని అందుకుని మృదువుగా నొక్కింది, అర్చన. కుమారి అర్చన